# రైలు పెట్టెలో

రైలు కదిలింది. ఎనమండుగురి కోసం ఉద్దేశించబడిన మా పెట్టెలో ఇరవయిమందిదాకా ఉంటారు. నా పక్కని చాలా డబ్బున్న చదువురాని ఆసామీ ఎవరో కాళ్ళు కూడా బల్లమీద పెట్టి సావకాశంగా కూర్చున్నాడు. ఖరీదయిన సిగరెట్టు కాలుస్తున్నాడు. మాకు ఎదుటిబల్లమీద ఒక మూలగా ఇద్దరు వయసులో వున్న ఆడపిల్లలు ఇరుకుగా కూర్చున్నారు. వాళ్ల తాలూకు భర్తలు ఇద్దరు రెండు బల్లలకీ మధ్య నిలబడి వున్నారు. వాళ్ళు చుట్టాలు ఆవడం చేత ఏ అమ్మాయి భర్త ఎవరో తెలియడం లేదు. మా బల్లమీద కూర్చున్న అందరికీ అది తేల్చుకో వలసిన అవసరం పట్టింది. అది అంత ముఖ్య విషయమని కాదు. అది తెలియకపోవడంవల్ల ప్రతి ఒక్కరి మనస్సులోనూ కొంత అశాంతి వుంది. కేవలమూ మనుష్యులను చూడగా చూడగా ఆ సమస్య దానంతట అదే విడిపోతుందని గావును. నా పక్కనున్న పెద్ద మనిషి ఆ ఇద్దరివేపూ అదే పనిగా చూస్తున్నాడు. మాలో కొంతమందికి ఆయనకున్నంత నైతిక సాహసం లేని కారణం చేత అప్పుడప్పుడు యాదాలాపంగా చూపినట్టు చూస్తున్నాం. ఆ యిరుకులోనే ఆ యిద్దరు ఆడ పిల్లలూ ఒకరిమీద ఒకరు వొరుగుతూ పకపక నవుతూ ఆ యిద్దరు భర్తలతోటీ పరాచకాలాడుతున్నారు. అయినా మాకు ఎవరి భర్త ఎవరో

తెలియలేదు. మాకు తెలియకుండా వాళ్ళు దాచిపెట్టుతున్నారా అన్నంత చిరాకు కూడా మాలో కొందరికి కలగకపోలేదు. పై బల్లల మీద ఇద్దరు కవులో, సాహితీపరులో పెద్ద గొంతుకలతో తర్కించుకుంటున్నారు.

"అపారే కావ్య సంసారే—" అన్నారు ఒకరు. ఆయన పూర్తి చెయ్యకుండానే

"కావ్యం యశసే అర్థకృతే—" అన్నారు ఇంకొకరు.

మధ్య మధ్య వారిద్దరూ కూడా కొద్దిగా వొంగి కింద వున్న జనాన్ని చూడ్డం కద్దు. చూస్తున్నప్పుడు కూడా మాట్లాడుకుంటూనే ఉన్నారు.

రైలు ఒక స్టేషను దగ్గర ఆగింది. జనం గుమ్మం దగ్గర మూగారు. గుమ్మం దగ్గర మా అందరి హక్కులకూ అవసరాలకూ వకాలతా పుచ్చుకున్న ఇద్దరు వ్యక్తులు జనాన్నిరాకుండా ఆపారు.

"ఇది పరుపుల పెట్టె. రెట్టింపు ఛార్జీ పుచ్చుకుంటారు."

"కాళీ లేదంటుంటే!"

ఈ రెండూ వీరి వాదాలు.

ఇంక, రైల్లో ఎక్కవలసిన వాళ్ల వాదాలు :

"మేం మాత్రం టిక్కట్టు కొనలేదంటయ్యా?"

"బాబ్బాబు! తలుపుతియ్యి ముసలాణ్ణి నాయనా!...."వగైరా—

అకస్మాత్తుగా పెట్టెలో కూర్చున్న వాళ్లందరిలోనూ ఒక వింత ఉద్రేకం పుడుతుంది అలాంటప్పుడు. దాన్నిదేశాభిమానం అనండి. స్థలాభిమానం అనండి. జాతీయ భావం అనండి—పెట్టెలో కూర్చున్న వాళ్లకి పెట్టెలో స్థలం మీద హక్కు ఏర్పడింది. అంచేత పరాయివాడు పెట్టెలో ప్రవేశించకూడదు. మన దేశాన్ని ఆక్రమించాడని ఇంగ్లీషువాడి మీద ఎంత కోపంగా ఉంటామో మనం ; అంత కోపమూ రైలు ఎక్కబోయే వాడిమీద చూపుతాం. కర్మం చాలక ఎవడో ఒకడు పెట్టెలోకి ఎక్కాడా: వాడికి ఆ

హక్కులన్నీ సంక్రమించడం చేత మిగతా వాళ్లని ఎక్కనీయకుండా చూడడానికి శక్తికొద్దీ పాటుబడతాడు.

రైలు మళ్ళీ కదిలింది ఎవ్వరూ పై వాళ్ళు ఎక్కలేదు. కాని రెండో పక్క గుమ్మం అవతల రెండు చిన్న తలకాయలు పైకి లేచాయి.

"దిగుదిగు!" అన్నారొకరు.

"రైలు కదిలింది, చచ్చిపోతారు. రానీయండి లోపలకి" అన్నారు. యింకొకరు.

ఒక మగ పిల్లవాడు, ఒక ఆడపిల్ల లోపలకు వచ్చారు. మూలగా నిలబడ్డారు. మగపిల్లవాడు చొక్కా పైకి ఎత్తి కడుపు మీద ఒక పక్కని రెండు చేతులతోనూ ధమధమ వాయించాడు. చటుకుని అనుకోకుండానే రెండు గొంతుకలు కంయిమని లేచాయి.

"అబ్ తేరే పివా కౌను మేరా——"

చటుకుని సంభాషణలన్నీ నిలిచిపోయాయి. ఆ కీచు గొంతుకలు చెవుల్లో గింగిర్లెత్తిస్తున్నాయి. వాళ్ళు అందరినీ డబ్బులు అడుక్కున్నారు. కొంతమంది యిచ్చారు. ఇవ్వని వాళ్ళలో నా పక్కని ఉన్న డబ్బున్న పెద్ద మనిషి ఒకడు.

నా రెండో పక్కని ఉన్న పెద్ద మనిషి నన్ను మెల్లగా భుజం మీద తట్టాడు. నేను ఆడవాళ్ల వేపు తాదాత్మ్యంతో చూస్తున్న కారణం చేత రెండోసారి తట్టేదాకా నాకు తెలియలేదు. కొంచెం మనస్సులోనే సిగ్గుపడ్డాను.

"మీదే వూరండీ?" అని అడిగాడు.

"కడియం" అన్నాను.

"మీరిప్పుడేవూళ్ళో వుంటున్నారండీ?" అన్నాడు.

చెప్పాను. క్రిందటి సంవత్సరం ఫలాని చోట ఉద్యోగం చేశాననీ, ఈ సంత్సరం ఫలాని చోటికి బదిలీ అయ్యిందనీ, లోగడ ఫలాని

ఫలాని ఊళ్లలో వుంటూ వచ్చాననీ, ఎక్కడో నా ముఖం చూపినట్లుగా ఆయనకు గుర్తు వుందట. నేనేమీ సమాధానం చెప్పలేదు. చివరకి పరిచయం ఎక్కడో తేలలేదు. ఇద్దరమూ చాలాసేపు ఇవీఅవీ మాట్లాడుకున్నాము. రైలు ఆగగానే నేను ఇద్దరికీ "టీ" కొన్నాను. ఆయన కిళ్లీలూ సిగరెట్లూ కొన్నాడు.

రైలు పెట్టె గుమ్మం దగ్గిర పెద్ద గలభా అవుతోంది. ఒక భారత దేశం అంత మనిషి గుమ్మం దగ్గిర నిలబడ్డ యోధులను చీల్చుకొని లోపలికి చొరబడుతున్నాడు. లోపలివాళ్ళు మాటలతో ఆ యోధులను హెచ్చరిస్తున్నారు. ఆ మనిషిని మందలిస్తున్నారు. కాని ఒక్క వూపుతో ఆ మనిషి మా దగ్గరకు వచ్చిపడ్డాడు. మళ్ళీ గుమ్మం దగ్గిర వాళ్ళు గుమ్మం దగ్గిరే వుండిపోయారు. యుద్ధంలో ఓడిపోయిన చిరాకు, రోషం, ఉక్రోషం, చిన్నతనం అన్నీ వాళ్ల మొహాల్లో కనబడ్డాయి. ఆ మనిషి పెద్దగా గుకరింపు నవ్వు నవ్వాడు. నా పక్కని వున్న డబ్బున్న పెద్ద మనిషివేపు ఒక రెప్పపాటుసేపు చూశాడు. అతన్ని సరిగ్గా కూర్చోమని అంటూనే మా ఇద్దరి మధ్యకూ వొంగాడు. అతని కాళ్లను తనే కింద పెట్టాడో; లేక ఆ పెద్ద మనిషి కింద పెట్టుకుంటే సహాయపడ్డాడో నాకు బోధపడలేదు. కాని ఒక రెప్పపాటులో ఆ డబ్బున్న పెద్ద మనిషి మామూలుగా కూర్చోడం, అతనికీ నాకూ మధ్య ఆగంతకుడు కూర్చోడం జరిగాయి. డబ్బున్న పెద్ద మనిషి మాత్రం ఏమీ అనలేదు. ఆగంతకుడు నా వేపు తిరిగి అన్నాడు.

"మహా ఉక్కగా వుందండి!....అగ్గిపెట్టి వుందా?"

"లేదు!" నేను చాలా ముభావంగా అన్నాను— అతను అల్లా చనువు చూపడం నాకిష్టం లేదని సూచించడానికి. కాని నా పక్కని నాతో యింత సేపూ మాట్లాడిన ఆసామీ తన జేబులోంచి అగ్గిపెట్టి తీసి ఇచ్చాడు క్రమంగా నేనూ నాతోబాటు ఆ పెట్టెలో చాలామంది కట్టుకున్న మర్యాద అనే కోట

అన్ని పక్కలా కూలిపోతోంది. అతన్ని పరాయివాడిలా చూడాలని సంప్రదించుకోకుండానే నిశ్చయించుకున్నాను. నేను ఆడవాళ్ల వేపు చూశాను. వాళ్ళు ఆగంతకుడివేపు చూస్తున్నారు. ఆగంతకుడు చుట్ట ముట్టిస్తూ అగ్గిపుల్ల కోసం దొప్పలా ముడిచిన చేతులపై నుంచి రహస్యంగా వాళ్లని చూస్తున్నాడు. వాళ్లు చిరునవ్వు నవ్వుకున్నారు. కాని ఇటేపు చూడ్డం మానలేదు.

"మీరెందాకః?" అని అడిగాడు.

"మద్రాసు.... మీరెందాకాః?"

"మద్రాసుః"

నేను బరువుగా నిట్టూర్చాను. రైలు ఆగగానే అతను కిందికి దిగాడు. పక్కపెట్లో పెట్టుకున్న పెట్టీ, పరుపూ చుట్టా తెచ్చుకున్నాడు. ఈసారి గుమ్మం దగ్గిర వాళ్ళు అతనిని అభ్యంతర పెట్టలేదు. పెట్టి బల్లకిందికి తోసాడు. పరుపు చుట్ట పై బల్లమీద విప్పబోయాడు. పైన కూర్చున్న కవులిద్దరూ అభ్యంతర పెట్టారు.

"పరుపు వాల్చనీ. నువ్వున్నంతసేపూ నువ్వే కూచుందూగాని" అన్నాడు. కవులు ఇద్దరూ పక్కకి జరిగారు. వాల్చిన పరుపు చుట్ట మీద కూర్చున్నారు.

రైలు నడుస్తోంది. ఆగుతోంది. మళ్ళీ నడుస్తోంది. చీకటి పడింది. జనం కొంతమంది దిగారు; కొంతమంది ఎక్కారు. ఆగంతకుడు కింద అల్లాగే కూర్చున్నాడు.

రైలు ఆగింది, భోజనాల కోసం చాలా మంది దిగారు "నేనుంటాను, మీరు పోయిరండిః" అన్నారు ఆగంతకుడు. తొందరగా భోజనాలు చేసి వచ్చాం. ఇద్దరు ముగ్గురు కొత్తవాళ్ళు మా స్థానాల్లో కూర్చున్నారు. ఒకతను మర్యాదగా లేచాడు. ఇంకొకతను కొంచెం పెంకితనం చేశాడు. ఆగంతకుడు లేచి నిలబడి నన్నక్కడ కూర్చోమన్నాడు. నేను అనుమానిస్తుంటే నన్ను

రెండు చేతులూ పట్టుకుని కూర్చోపెట్టాడు. కొత్తగా వచ్చిన మనిషి ఎదురుగా నిలబడి లెమ్మన్నాడు. అతను లేవనన్నాడు. రెండు చేతులలోనూ అతన్ని లేవదీసి సునాయాసంగా ఆ స్థానంలో తను కూర్చున్నాడు. ఆ మనిషి కొంచెం గింజుకోబోయాడు.

"మర్యాదగా లెమ్మన్నప్పుడు లేవాలి. నా దగ్గర పెంకితనం పనికి రాదు!" అన్నాడు ఆగంతకుడు.

"పెంకితనం ఏంటయ్యా? మేమా మాత్రం డబ్బిచ్చి కొనుక్కోలా?" అన్నాడు ఆ మనిషి.

"ఆహా! డబ్బిచ్చికొన్నా? ఏటి కొన్నా? నేను ముందే చెప్పాను. వారంతా భోజనాలకి పోయారు. వస్తారు; లేవాలి సుమా అని!"

ఆ మనిషి తన వాదం మార్చాడు.

"నాకు ఒంట్లో బాగాలేదు"

"ముందే ఎందుకు చెప్పలేదు?"

ఆ మనిషి మాట్లాడలేదు.

" మీ పేరండీ?" అని అడిగాను నేను ఆగంతకుడిని.

"శేషగిరిరావు"

రైలు కదిలింది శేషగిరిరావు మీద మా కందరికీ భక్తి కలిగింది. రైలు ప్రయాణంలో కొన్ని వ్రాసి పెట్టని నీతులున్నాయి. అన్నీ శేషగిరిరావుకి తెలుసును.

రైలు ఆగిన చోటల్లా అతడు దిగేవాడు. పెట్టెలో కూర్చున్నవాళ్లకి ఏం కావాలంటే అది తెచ్చిపెట్టేవాడు. తన చోటు ఉంటుందో అన్న చింత అతనికి అసలు లేదు. అతని చోటులో ఎవరన్నా కూర్చున్నా అతడు లెమ్మని అడగడు. ఏదో కబుర్లు చెబుతూ నిలబడే వుంటాడు. కాని మాలో ప్రతి ఒక్కరూ అతనికి చోటు లేకపోతే సహించలేరు. మా అందరికీ అంత

అప్పుడయిపోయాడు. పెట్టెలో ఒక క్రమమూ ఒక న్యాయమూ ఒక పద్ధతీ వచ్చాయి. చక్కగా నునుపుగా నడిచే యంత్రంలాగా మా పెట్టిలో పరిపాలన సాగింది. మా అందరి మంచి కోసమూ మేమంతా శేషగిరిరావు ఆజ్ఞలను శిరసావహించాము. దేశీయ ప్రభుత్వాన్ని కూడా ఇంత సుళువుగానూ ఇంత సరదాగానూ ఇతడు నడపగలడని మా కందరికీ ఆతనిమీద గురి ఏర్పడింది.

నాకు నిద్ర వస్తోంది. కూర్చున్న చోటే వెనక్కి వొరిగాను. రైలు కుదుపు. శేషగిరిరావు అసంబద్ధమైన మాటల ధోరణి జోల పాటలాగ ఉపకరించాయి. నాకు మనస్సులో వింత సంతృప్తి నిండిపోయింది. ఈ శేషగిరిరావుకి సంస్కారములేదు. చదువూ లేదు. అయితే వాటిలో నిమిత్తం లేకండా అందరినీ ఆకర్షించే శక్తి ఏదో అతనిలో వుంది. అతడు మోటుగా ఎవరినీ ఆజ్ఞాపించలేదు. కాని మనిషిలో స్వార్థరాహిత్యాన్ని. సహకారాన్ని రేకెత్తించే తత్వమేదో అతని ప్రతి కదలికలోనూ ఉంది. ఇంత దిద్దితీరుస్తున్నా అతను మనకంటే అధికుడనే గౌరవ భావం మనలో పుట్టదు. మనతో కలిసి మెలిసి తిరిగే సామాన్య మానవుడే మనకు కనబడతాడు. దీనికంతకీ కిటుకు అతనిలో స్వార్థం అనేది అసలే లేకపోవడమేమో.

సగం కలగా మారిపోతున్న నా అలోచనలు చటుకుని ఆగిపోయాయి. నాకు పూర్తిగా మెలకువ వచ్చింది. శేషగిరిరావు నా మీదికి వాలుతున్నాడు. నిద్ర ఆవహించిన ఆ ముఖం అంద వికారంగా వుంది మనిషి యొక్క నిస్సహాయత మూర్తిభవించినట్లుంది. ఆ ఆకారం అతని చొక్కా బొత్తాములు తొలగి పోయి. నల్లని రొమ్ము. తొసుకుని వచ్చే పెద్ద పొట్ట బయటకి కనబడుతున్నాయి. గురుర్రులో అప్పుడప్పుడూ రెపరెపలాడే పెదవులూ అవీ చూస్తే నాకు అనంతమైన అసహ్యం కలిగింది.

ఆ రాత్రి నాకింక నిద్ర పట్టలేదు.

[ఆంధ్రజ్యోతి మాస పత్రిక........సం॥చక్రపాణి]